క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించండి


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబయ్య

కార్వేటినగరం: రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారి బాబయ్య అన్నారు. మంగళవారం ఆయన మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని సంపత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాల, కార్వేటినగరం పెద్ద దళితవాడ ప్రాథమిక పాఠశాల, సుద్దగుంట పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ రోజూ మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం నాణ్యతగా వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను, రికార్డులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు.

విస్తృతంగా మొబైల్ ఆధార్ క్యాంప్‌లు


శ్రీకావేరిరాజుపురం : ఆధార్‌లో మార్పు, చేర్పులు చేయించుకుంటున్న ప్రజలు

పాలసముద్రం : ఆధార్‌కార్డు అప్‌డేట్, మార్పులు, చేర్పుల కోసం ప్రజలు ఇబ్బందులు తప్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మొబైల్ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసిందని శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని సచివాలయాల వారీగా తేదీలను ప్రకటించి అక్కడ వాటిని ఏర్పాటు చేసి ఆధార్ సేవలను చేరువ చేశారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి రాజకుమార్ సమక్షంలో రాష్ట్రప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి, అర్హులైన వారి ఆధార్‌కు వాటిని లింక్ చేస్తున్నారు. సర్పంచు గాలి మహేష్‌బాబు మాట్లాడుతూ ఆధార్ కార్డులను ప్రజలు అప్‌డేట్, మార్పులు, చేర్పులు చేయించుకోకపోవడం వల్ల కొందరు పథకాలకు అనర్హులుగా మారుతున్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మోహన్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు


నిరసన తెలుపుతున్న రెడ్డిసంఘం నాయకులు

వెదురుకుప్పం: మండల కేంద్రంలో స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ప్రతిష్ట కోసం వేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం వారు వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిలాఫలకం ధ్వంసం చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన తొలితెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అవమానకరమన్నారు. దుండగులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు.

ఈశ్వరాలయం పన్ను చెల్లింపు

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిల మొత్తాన్ని మంగళవారం పురపాలక సంఘానికి చెల్లించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు తెలిపారు. 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ.2,08,138 బకాయిలు ఉన్నాయని తెలిపారు. అయితే ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీని మినహాయించుకుని రూ. 1,32,974లకు సంబంధించి చెక్కును మున్సిపాలిటీ మేనేజర్ మణిశంకర్‌కు అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, సుందరం, బాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

కామర్స్ అధ్యాపకులు కావలెను

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించడానికి తాత్కాలిక అధ్యాపకులు అవసరమని ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.కామ్‌తో పాటు యూజీసీ నెట్ లేదా సెట్ విద్యార్హత కలిగిన వారు ఈ పోస్టుకు అర్హులన్నారు. పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో ఏప్రిల్ 3వ తేదీన కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9490600323 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

వడమాలపేట : మండలంలోని అప్పలాయగుంట, పూడి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ భాస్కర్‌రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్లు మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

మట్టిపాత్ర.. ఆరోగ్య ప్రదాత

నాడు మట్టికుండలు లేని ఇళ్లు ఉండేవి కావు. ప్రస్తుతం ఆధునిక మోజులో పడి ప్రజలు వీటికి స్వస్తి పలికారు. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు దిశగా వెళ్లిపోయారు. దీంతో ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నవారు. మళ్లీ వెళ్లిన దారినే తిరిగి వస్తున్నారు. ఆరోగ్యాన్ని ప్రసాదించిన నాటి పాత్రల కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు.

- మట్టితో తయారైన బాటిళ్లు, కూజాలు, టీ కప్పులు
- చూపరులను ఆకర్షిస్తున్న వినూత్న పాత్రలు
- మట్టిపాత్రల్లో నీరే శ్రేయస్కరం అంటున్న వినియోగదారులు
- వేసవిలో ఊపందుకున్న కుండల వ్యాపారం


విక్రయానికి సిద్ధంగా ఉంచిన కుండలు

నగరి: ఒక్కో సీజన్‌లో ఒక్కో వస్తువుకు గిరాకీ ఉంటుంది. వర్షాకాలంలో రెయిన్‌కోట్లు, గొడుగులకు గిరాకీ ఉంటుంది. అలాగే వేసవిలో మట్టి పాత్రలు, కుండలకు యమా డిమాండ్. ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ఉక్కపోతతో జనం సతమతమవుతున్నారు. వాహనాల్లో ప్రయాణించాలంటే వేడిగాలులకు భయపడాల్సి వస్తోంది. వేసవి ప్రారంభంలో భానుడు భగభగమంటున్నాడు. దీంతో దాహం వేస్తే ఎవరికైనా చల్లని నీరు తాగాలనిపిస్తుంది. ఫ్రిడ్జ్‌లలో ఉంచిన నీటిని తాగరాదని వైద్యులు సూచిస్తుండడంతో మట్టికుండలో నీరు తాగడానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని మట్టికుండల తయారీదారులు వినియోగదారులను ఆకర్షించడానికి వినూత్న వస్తువులు చేస్తున్నారు. ఇక్కడ తయారుచేసే మట్టిపాత్రలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మట్టిపాత్రలను విక్రయాలకు ఉంచుతున్నారు. సాధారణంగా కుండలు, కొళాయిలు అమర్చిన కుండలను వ్యాపారులు విక్రయిస్తుంటారు. అయితే ఈ వేసవికి సమ్‌థింగ్ స్పెషల్ అంటూ సరికొత్త పాత్రలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

ఆకర్షిస్తున్న మట్టి బాటిళ్లు, కూజాలు..

ప్రజల అవసరాలను బట్టి తయారీ దారులు మట్టిపాత్రలకే ఆధునిక హంగులు దిద్దుతున్నారు. కుండలతో పాటు మట్టితో తయారు చేసిన రంగురంగుల బాటిళ్లు, గ్లాసులు, కూజాలు, టీకప్పులు, దోసె పెనం, చపాతి పెనుం, పువ్వులు అలంకరించి పెట్టే తొట్టెలు, పూల కుండీలు విక్రయానికి ఉంచుతున్నారు. ఇవి చూపరులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. రోడ్డు పక్కనే ప్రదర్శనగా ఉంచడంతో వీటిని చూసిన వెంటనే పలువురు కొనుగోలు చేస్తున్నారు. మట్టితో తయారుచేసిన బాటిల్ పరిమాణం అనుసరించి ధర పలుకుతోంది.

మట్టిపాత్రల ప్రత్యేకత ఏంటంటే..!

పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టి కుండలు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ధనవంతులకు ఇప్పుడు ఇదే దిక్కువుతోంది. డాక్టర్లు ఇచ్చిన సలహాలతో కుండనీరు తాగడం వల్ల పలు ఉపయోగాలున్నాయని గుర్తించిన వినియోగదారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కుండ కొనుగోలు చేస్తే ఫ్రిజ్, ఫిల్టర్ రెండూ కొనుగోలు చేసినట్టే అని అంటున్నారు. నీటిలోని మలినాలను లాగేసి స్వచ్ఛమైన నీటిని అందించడం మట్టిపాత్రల ప్రత్యేకత. బాటిళ్లలో, కూజాల్లో పోసిన నీరు కొంతసేపటికే ఫ్రిజ్‌లో తీసిన బాటిళ్లలా చల్లగా మారుతున్నాయి.


బాటిళ్లు


టీ కప్పులు

ఆర్డరు ఇస్తే అందిస్తున్నాం..



మట్టిపాత్రల తయారీనే మా వృత్తి. దశాబ్దకాలంగా వీటిపైనే ఆధారపడి బతుకుతున్నాం. ప్రస్తుతం వేసవికి చూపరులను ఆకర్షించే పాత్రలు చేయాలని అనుకున్నాం. అందులో భాగంగా కొన్ని వినూత్న పాత్రలు ఇక్కడ తయారుచేశాం. మరికొన్నింటిని ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించాం. వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. కొందరికి పాత్రలు అందుబాటులో లేకుంటే ఆర్డరుపై తయారుచేసి అందిస్తున్నాం. మట్టిపాత్రలు వాడకం ఆరోగ్యానికి మంచిదని పలువురు గ్రహిస్తున్నారు.

– అముద, మట్టిపాత్రల తయారీదారు, టీఆర్ కండ్రిగ

వడ్డీ లేని చెల్లింపులకు రెండురోజులే గడువు

నగరి : దీర్ఘకాలంగా చెల్లించని ఆస్తి, కొళాయి పన్నులను వడ్డీరాయితీపై చెల్లించడానికి గడువు రెండు రోజులు మాత్రమే ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిపడిన పన్నులన్నింటినీ ఒకేసారి ఏకమొత్తంగా చెల్లించే వారికి వడ్డీ పూర్తిగా మాఫీ అవుతుందన్నారు. ఇలాంటి అవకాశం మళ్లీ రావడం అరుదని, ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్నులను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. వార్డు సచివాలయాల్లో గానీ, మున్సిపల్ కార్యాలయంలో గానీ, పుర సేవా యాప్ ద్వారా గానీ, సీడీఎంఏ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారాగానీ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించవచ్చన్నారు.

ప్రైవేటు స్కూళ్లల్లో ఉచిత విద్యాహక్కు

నగరి : ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉచిత విద్యను అభ్యసించవచ్చని ఎంఈఓ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 6 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఏప్రిల్ 10వ తేదీలోపు 1వ తరగతిలో ప్రవేశం ఉచితమన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సి) మేరకు 25 శాతం సీట్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల కోసం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో రిజర్వ్ చేయబడ్డాయన్నారు. దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాల లబ్ధిదారులు, భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారు అర్హులన్నారు. ప్రవేశ దరఖాస్తును సీఎస్‌సి.ఏపీ.ఇన్/ఆర్‌టీఈ వెబ్‌సైట్‌లో గానీ, వార్డు, గ్రామ సచివాలయాల్లో గానీ ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమాచారం కోసం నగరి మండల విద్యాశాఖ కార్యాలయంలో, లేదా సచివాలయాలు, ప్రైవేటు పాఠశాలల్లో గానీ సంప్రదించవచ్చన్నారు. సందేహాలుంటే 14417 టోల్‌ఫ్రీ నంబరుకు, లేదా హెల్ప్‌లైన్ నంబరు 9502666864కు ఫోన్ చేయవచ్చన్నారు.

స్పందన అర్జీలను ఆన్‌లైన్‌లో పెట్టాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : మండల పరిధిలోని గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. మంగళవారం ఆయన బాలకృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తే, సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీపై పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో దీర్ఘకాలిక వ్యాధులకు స్వస్తి


బాలికలకు చిరుధాన్యాలతో తయారు చేసిన పౌష్టికాహారం అందిస్తున్న అధికారులు


పౌష్టికాహార ప్రదర్శనను సందర్శిస్తున్న సీడీపీఓ వినతిశ్రీ

పెనుమూరు(కార్వేటినగరం) : చిరుధాన్యాల వాడకంతో దీర్ఘకాలిక వ్యాధులకు స్వస్తి పలకవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ వినతిశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉగ్రాణపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ దూరమవుతాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల గుండెజబ్బులు, చర్మవ్యాధులు, రక్తహీనతలను అధిగమించవచ్చని సూచించారు.

కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను వారు తిలకించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, హెల్పర్లు పాల్గొన్నారు.

మానసిక స్థైర్యానికి ధ్యానం అవసరం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక వక్తలు

వెదురుకుప్పం: మానసిక స్థైర్యం కోసం ధ్యానం ఎంతో దోహదపడుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక వక్త మిట్టమనోహర్ వ్యాఖ్యానించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు హైదరాబాద్ పిరమిడ్ ధ్యాన మందిరం వారి ఆధ్వర్యంలో శ్వాసపై ధ్యాస అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ధ్యానం ఎంతో విశిష్టమైనదన్నారు. మానసిక ప్రశాంతతకు ధ్యానం ఎంతో ఉపయోగమన్నారు. శ్వాస మీద ధ్యాస ఉంచితే మనిషి కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతారని తెలిపారు. విద్యార్థులు తమ జీవన నైపుణ్యాలతో పాటు ఒత్తిడి జయించేందుకు ధ్యానం చేయడం అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఎంఈఓ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల మనిషికి ఏకాగ్రతతో పాటు ధైర్యాన్ని పొందడమే గాక మానసిక సంతోషాన్ని పొందగలుగుతారన్నారు. హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని సుభాష్ పత్రీజి స్థాపించి తద్వారా ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. చివరిలో ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలకు సంబంధించి పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిరమిడ్ ధ్యాన మందిరం కార్యకర్తలు భారతమ్మ, భానుప్రసాద్, మురళీరెడ్డి, బండి ప్రభాకర్‌రెడ్డి, శ్యామల, కమలనాభన్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయండి

పుత్తూరు రూరల్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్లను పుత్తూరులో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, కార్మిక చట్టాల కొనసాగింపు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర అంశాలపై జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసనలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పురుషోత్తం, రమేష్, కృష్ణమూర్తి, వెంకటేష్, మోసెస్, గోవిందస్వామి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



వడమాలపేట : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బాబు తెలిపారు. మంగళవారం వడమాలపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ జయంతి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలో జయంతిని నిర్వహించడానికి మండల ప్రజలు, నాయకులు, దళిత సంఘాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిబాబు, నాగరాజు, లోకనాథం, రాజశేఖర్, సుబ్రమణ్యం, దాము, పీరయ్య, ప్రభాకర్, గోపి, చెంగల్‌రాయులు, నాయకులు నందయ్య, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్‌ఎస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ ఏ.హరి అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

వాహన తనిఖీలు విస్తృతం


వాహనాల రికార్డులు సరిగా లేనివారికి ఆన్‌లైన్‌లో జరిమాన వేస్తున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం : ద్విచక్రవాహనదారులు తమ వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా మండలంలో ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతున్నాయి. అందువల్ల బైక్‌లు నడిపేవారు రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవని తెలిపారు. ముఖ్యంగా వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పక ఉండాన్నారు. అనంతరం ఆయన రికార్డులు లేని వాహనదారులకు ఆన్‌లైన్‌లో జరిమానా విధించారు.

నేడు గడప గడపకు..

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని పద్మసరస్సు ఎస్టీకాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ధనంజయవర్మ తెలిపారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలగురునాథీశ్వరునికి రుద్రాభిషేకం


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాలసముద్రం : మండలంలోని రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం రుద్రాభిషేకం, యాగశాల, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు యాగశాలకు కావలసిన పూజాసామగ్రిలతో మంగళ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ హోమం, శాంతిహోమం, యాగశాల పూజలు చేపట్టారు. అనంతరం కొలను నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించి, సుందరంగా అలంకరించారు. మండల పరిధిలోని భక్తులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటు

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకోదండ రామస్వామి ఆలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతం చేయడానికి పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా ఉత్సవ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా ఎస్.ఆనంద్, కె.నవీన్‌కుమార్, కె.నాగమణి, టి.కుమారి, సి.వెంకటమునిని నియమించారు. వీరి ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు టెంపుల్ ఈఓ మునికృష్ణయ్యకు మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రతి పథకం అర్హులకు అందిస్తున్నాం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

– రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తయ్యూరు సచివాలయ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ పరిధిలోని బసివిరెడ్డిపల్లి షికారీకాలనీ, బీసీ కాలనీ, పెద్దతయ్యూరు గ్రామాల్లో ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన పేదలకు అందుతోందని తెలిపారు. ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన అందించాలన్న ఉద్దేశంతో గ్రామాల్లో సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతుభరోసా కేంద్రాలను నిర్మించి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. అలాగే వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

డిప్యూటీ సీఎంకు సన్మానం..

గతంలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న షికారీ కాలనీ గ్రామాల్లో పర్యటించి విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించడంతో పాటు ఇంటి పట్టాలను రెండు రోజుల్లో అందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామిని షికారీ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు అన్ని పథకాలు అందుతున్నాయని కొనియాడారు. అనంతరం 50 బసివిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డిప్యూటీ సీఎం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మీకు యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లు, మధ్యాహ్నం భోజనం ఎవరిస్తున్నారని ఆయన ప్రశ్నించగా .. మాకు మా జగన్‌మామయ్య ఇస్తున్నారని విద్యార్థులు ముక్తకంఠంతో తెలిపారు. మేమంతా బాగా చదువుకుని జగన్ మామయ్య ఆశయ సాధనకు పాటు పడతామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వరదమ్మ, డీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు విజయబాబు, జనార్దన్, గుండుమణి, బాబు, సుబ్రమణ్యం, తులసీమణి, రవి, హరిప్రసాద్‌రెడ్డి, భూపతి రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు.

సీతారాముల విహారం.. భక్తుల తన్మయత్వం


తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న శ్రీసీతారాముల వారు

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీసీతారాముల వారు శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం తిరుచ్చి వాహనంపై గ్రామ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం వంటి నిత్య కైంకర్యాలను చేపట్టారు. అలాగే సీతారాములతో పాటు లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం 5.30 గంటలకు సీతారాముల వారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి నేత్రపర్వంగా ఊంజల్ సేవ నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటలకు స్వామి వారు తిరుచ్చి వాహనంపై మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో దర్శనమివ్వగా భక్తులు తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీసీతారాముల వారు కల్పవృక్ష వాహనంపై దర్శనమిస్తారని ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

గాలివానకు దెబ్బతిన్న పంటలు


ఈదురు గాలులకు వెంగళరాజుకుప్పంలో దెబ్బతిన్న అరటితోట


కొబ్బరిచెట్టు పడడంతో కూలిన పూరిల్లు

పాలసముద్రం : మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీనికితోడు విపరీతమైన ఈదురు గాలులు వీయడంతో అరటి, వరిపంటలు దెబ్బతిన్నాయి. ఇందిరానగర్ ఆదిఆంధ్రవాడలో బాబు ఇంటిపై కొబ్బరిచెట్టు పడడంతో పూరిల్లు నేలకూలింది. అలాగే వెంగళరాజుకుప్పం, కృష్ణజమ్మపురం గ్రామాల్లో వరి, చెరుకు, అరటి పంటలు గాలులకు నేలవాలాయి. ఈదురు గాలులకు ఇంటిపై కొబ్బరిచెట్టు పడి నష్టపోయిన బాబు కుటుంబానికి తహసీల్దార్ బాబు తక్షణ సాయం కింద 10 కిలోల బియ్యం, పప్పు, ఆయిల్ తదితర నిత్యావసర సరుకులు అందించారు.